క్లుప్తంగా

క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేయాలి



కంకిపాడు: క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేయాలని వైఎస్సార్ సీపీ పెనమలూరు నియోజకవర్గ సమన్వయకర్త దేవభక్తుని చక్రవర్తి పిలుపునిచ్చారు. పార్టీ మండల యువజన విభాగం అధ్యక్షుడిగా నియమితులైన తాళ్లూరి మరియబాబు, పార్టీ మండల కార్యవర్గ సభ్యుడు చోరగుడి మహేష్, మహిళా నేత రమణ ఆదివారం మర్యాదపూర్వకంగా కానూరులో చక్రవర్తిని కలిశారు. ఈ సందర్భంగా చక్రవర్తి నూతనంగా పదవుల్లో నియమితులైన వారిని సత్కరించారు. ఆయన మాట్లాడుతూ సంస్థాగతంగా పార్టీని పటిష్టపర్చాలన్నారు. కూటమి ప్రభుత్వం చేసే కుట్రలను తిప్పికొట్టి ప్రజలను చైతన్యం చేయటంలో ముఖ్య భూమిక పోషించాలని సూచించారు.

ఫ్రీజర్ బాక్స్ అందజేత



పొణుకుమాడు(గన్నవరం): ఉంగుటూరు మండలం పొణుకుమాడు గ్రామ పంచాయతీకి దాత చెరుకూరి భానుమతి, వారి కుటుంబ సభ్యులు రూ.80 వేలు విలువైన ఫ్రీజర్ బాక్స్‌ను అందజేశారు. ఈ మేరకు ఆదివారం సర్పంచి అన్నే సుబ్బలక్ష్మి సమక్షంలో గ్రామ పంచాయతీకి ఫ్రీజర్ బాక్స్ అందించారు. ఈ సందర్భంగా సర్పంచి మాట్లాడుతూ.. గ్రామస్తుల సౌకర్యార్థం ఉచితంగా ఫ్రీజర్ బాక్స్‌ను అందజేసిన దాతకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు. గ్రామాభివృద్ధికి, ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయల కల్పనకు దాతలు స్వచ్ఛందంగా ముందుకురావాలని కోరారు. మాజీ సర్పంచి చింతల శ్రీనివాస రావు, దాత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా ఏపీఐఐసీ ఖాళీ స్థలం



ఆటోనగర్(విజయవాడతూర్పు): జవహర్ ఆటోనగర్ కాటా సెంటరు వెనుక ఉన్న ఏపీఐఐసీకి చెందిన ఖాళీ స్థలం కొన్నేళ్లుగా నిరుపయోగంగా మారింది. ఈ స్థలంలో పిచ్చి చెట్లు ఏపుగా పెరిగాయి. చుట్టు పక్కల వారు ఈ స్థలాన్ని ఆక్రమించుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఐలా అధికారులు దీని చుట్టూ కనీసం ఇనుప కంచె వేయకపోవడంతో ఆక్రమణలకు గురయ్యే ప్రమాదం ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత కొన్ని సంవత్సరాల నుంచి విలువైనా ఈ స్థలం నిరుపయోగంగా ఉంది. సమీపంలోని పరిశ్రమలకు చెందిన పలువురు వ్యర్థాలను ఈ ప్రదేశంలో పడవేస్తున్నారు. దీంతో ఈ ప్రాంతం అపరిశుభ్రంగా మారుతుంది. చెత్తను సైతం తగులబెడుతున్నారు. దీనికి అనుకొని మరుగుదొడ్డి కాంప్లెక్స్ ఉంది. ఈస్థలంలో కేవలం చిన్న హెచ్చరిక బోర్డు మాత్రమే పెట్టడం గమనార్హం. స్థలాన్ని జాగ్రత్తగా ఉంచకపోతే భవిష్యత్‌లో ఆక్రమణకు గురయ్యే ప్రమాదం ఉంటుందని స్థానికులు అంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఏపీఐఐసీ ఖాళీ స్థలాలకు ఫెన్సింగ్ వేయాలని కోరతున్నారు.

యువతను సన్మార్గంలో నడిపించేదే భగవద్గీత

భవానీపురం(విజయవాడపశ్చిమ): యువతను క్రమశిక్షణతో కూడిన సన్మార్గంలో నడిపించేది భగవద్గీత అని మంగళగిరి శ్రీచైతన్య మహాప్రభు పాదపీఠ మందిరం పీఠాధిపతులు శ్రీ త్రిదండి భక్తి సుందర్ మంగళ్ మహారాజ్ స్వామీజీ తెలిపారు. భవానీపురానికి చెందిన శ్రీగోవిందనామ ప్రచార సేవా సంఘం ఆధ్వర్యంలో హౌసింగ్‌బోర్డ్ కాలనీలోని వీఎంసీ కల్యాణమండపంలో నిర్వహించిన శ్రీభగవద్గీత ప్రగతి పథం 8వ వార్షికోత్సవం కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా భగవద్గీత శ్లోక పఠనం పోటీల్లో గెలుపొందిన చిన్నారులకు జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. అనంతరం స్వామీజీ మాట్లాడుతూ వ్యక్తిత్వ వికాసానికి భగవద్గీత ఎంతగానో దోహదపడుతుందని చెప్పారు. సమాజంలో ఉన్నత స్థాయికి ఎదిగేందుకు విజయావకాశాలను చూపించే దర్శిని భగవద్గీత అని పేర్కొన్నారు. చిన్నారులతో భగవద్గీతలోని శ్లోకాలను పఠింపచేస్తూ వారిలో ఆధ్యాత్మిక చింతన పెంపొందించటం శుభపరిణామమని తెలిపారు. శ్రీగోవిందనామ ప్రచార సేవా సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు సునీతా మధుసూదన్ దంపతులు నిర్వహించిన కార్యక్రమంలో భారత్ వికాస్ పరిషత్ ఈస్ట్ జోన్ ప్రెసిడెంట్ జగదీష్, నంబూరు జనార్దన్, మాధవి దంపతులు, మాజేటి సూర్య వేణుగోపాల్ శ్రేష్ఠి, మంగళగిరి ఫణిధర్ సుజాత, లక్ష్మీప్రసన్న, రమేష్, జగదీష్, మోహన్, సునీత, భగవాన్ పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డేది?

- పలు గ్రామాల్లో జోరుగా అసాంఘిక పనులు
- నిర్మానుష్య ప్రాంతాల్లో ఆగడాలు
- భయాందోళనలు వ్యక్తం చేస్తున్న ఆయా గ్రామస్తులు



అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారిన ఎనికేపాడు వంతెన



వంతెన దిగువన పడవేసిన మద్యం సీసాలు, గ్లాసులు, వాటర్ బాటిళ్లు

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం పలు గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలు పెచ్చుమీరుతున్నాయి. రామవరప్పాడు, ప్రసాదంపాడు, ఎనికేపాడు, నిడమానూరు గ్రామాల్లోని నిర్మానుష్య ప్రాంతాలు, కాల్వగట్టు, రైల్వే కట్ట ప్రాంతాల్లో కొందరు ఆకతాయిల ఆగడాలు శృతి మించుతున్నాయి. రామవరప్పాడు రైల్వేస్టేషన్ సమీపంలో, బుడమేరు కాలువ వద్ద వెంచర్లు, మర్రిచెట్టు వద్ద, ప్రసాదంపాడు రైల్వేకట్ట, టయోటా షోరూమ్ వెనుక వైపు కట్ట, విజయ ఇంజినీరింగ్ కళాశాల వెనుక వైపు ఖాళీ స్థలాల్లో ఈ సమస్య ఎక్కువగా ఉందని స్థానికులు చెబుతున్నారు.

ఎనికేపాడు వంతెన వద్ద..

ఎనికేపాడు రైవస్ కాలువ వంతెన అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారుతోంది. ఎస్సీ కాలనీ సమీపంలోని ఈ వంతెన వద్ద కార్యకలాపాలు ఎక్కువ అవడంతో సమీప నివాసితులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామానికి దూరంగా నిర్మానుష్యంగా మారిన ఈ ప్రాంతం ఆకతాయిలకు అడ్డాగా మారింది. పగలు, రాత్రి తేడా లేకుండా నిత్యం వంతెన పరిసర ప్రాంతాల్లో కొందరు మద్యం తాగడం, గంజాయి సేవించడం వంటి కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. రాత్రి సమయాల్లో వీరి ఆగడాలు మరింత పెచ్చుమీరుతున్నాయి. పైగా గ్రామంలో పలు చోట్ల ఉన్న బెల్టుషాపుల వద్ద ఏ సమయంలోనైనా మద్యం సులువుగా లభిస్తోంది. దీంతో ఆటోలు, ద్విచక్ర వాహనాల్లో యువకులు తరలివచ్చి ఇక్కడ మకాం వేస్తున్నారు. గ్రూపులుగా మారి వంతెన రైలింగ్ మీద కూర్చొని మద్యం సేవిస్తున్నారని పలువురు సమీప నివాసితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఒక్కోసారి అర్ధ రాత్రి వరకు కూడా ఈ పరిసరాల్లోనే సంచరిస్తున్నారని చెబుతున్నారు. గతంలో ఇక్కడ మద్యం సేవించడానికి వచ్చిన రెండు గ్రూపుల మధ్య గొడవ జరిగింది. పెద్దపెద్దగా అరుస్తూ దాడులు చేసుకున్నారని స్థానికులు గుర్తు చేస్తున్నారు.

యథేచ్ఛగా జూదాలు

గంజాయి, మద్యమే కాకుండా ఆయా గ్రామాల్లోని నిర్మానుష్య ప్రాంతాల్లో జూదాలు ఆడటం కూడా పెరిగిపోతోంది. రామవరప్పాడులోని ఖాళీ వెంచర్లు, ఎనికేపాడు వంతెన పరిసర పొలాల్లో జోరుగా జూదాలు ఆడుతున్నారు. పేకాట, లోపల బయట, చిత్తుబొమ్మ వంటి జూదాలను ఎక్కడిఎక్కడి నుండో వస్తున్న పోకిరీలకు నిలయంగా మారిందని గ్రామస్తులు ఆవేదన చేందుతున్నారు. పొలాల్లో, చెట్ల పొదల్లో నిత్యం జూదాలు ఆడుతున్నారని వీరు చెబుతున్నారు.

సెలవు దినాల్లో తాకిడి ఎక్కువ..

గతంలో పేకాట ఆడుతున్నారని పోలీసులకు సమాచారం ఇవ్వడంతో జూదగాళ్లను పట్టుకుని నగదు స్వాధీన పరుచుకున్నారని ఈ ప్రాంతవాసులు తెలిపారు. ప్రస్తుతం పోలీసుల పహారా లేకపోవడంతో మళ్లీ జూదగాళ్లు విజృంభిస్తున్నారని వాపోతున్నారు. పండుగలు, సెలవు దినాల్లో జూదగాళ్ల తాకిడి ఎక్కువగా ఉంటోందని పొలాలకు రైతులు వెళ్లాలన్నా వీరి చేష్టలకు భయపడాల్సి వస్తోందని ఆవేదన చెందుతున్నారు. పోలీసులు గస్తీ నిర్వహించి ఇటువంటి అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా అడ్డుకట్ట వేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పోలీసులు గస్తీ పెంచాలి

రాత్రి సమయాల్లో పోలీసులు గస్తీ పెంచాలని ఆయా గ్రామస్తులు కోరుతున్నారు. రామవరప్పాడు రైల్వేస్టేషన్ ప్రాంతం, మర్రి చెట్టు వద్ద, వెంచర్లు, రైల్వేకట్ట, ప్రసాదంపాడు టయోటా షోరూమ్ వెనుక ప్రాంతం, ఎనికేపాడు వంతెన సెంటర్, నిడమానూరు శివారు పొలాల్లో పోలీసులు గస్తీ పెంచాలని కోరుతున్నారు. అసాంఘిక ఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

అడ్డుకట్ట వేయాలి

ప్రస్తుతం వంతెన వద్ద ఆకతాయిల ఆగడాలు ఎక్కువవుతున్నాయి. నిత్యం వంతెన వద్ద మద్యం సేవించడం పరిపాటిగా మారింది. మద్యం మత్తులో గొడవలు దిగుతూ భయబ్రాంతులకు గురి చేస్తున్నారు. రాత్రుళ్లు వంతెన వద్ద పోలీసులు నిఘా పెంచి ఇటువంటి కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయాలి. సమీప పొలాల్లో జరుగుతున్న జూదాలను అరికట్టాలి. – సీహెచ్ రాజా, ఎనికేపాడు

గస్తీ ముమ్మరం చేశాం..

సమస్యాత్మక, నిర్మానుష్య ప్రాంతాల్లో గస్తీ ముమ్మరం చేశాం. రాత్రుళ్లు ఆయా గ్రామాల్లో పెట్రోలింగ్ నిర్వహించి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడకుండా అడ్డుకుంటున్నాం. రాత్రుళ్లు అనుమానాస్పదంగా తిరుగుతున్న వారిని, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించేవారిని అదుపులోకి తీసుకుని కేసులు నమోదు చేస్తున్నాం. – హరికృష్ణ, ఎస్ఐ పటమట

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెనమలూరు: కానూరులో విద్యుత్ సరఫరాకు సోమవారం అంతరాయం ఉంటుందని ఈఈ ఆపరేషన్స్ పి.హరిబాబు తెలిపారు. ఆయన ఆదివారం మాట్లాడుతూ.. కానూరు కొత్త ఆటోనగర్ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా సోమవారం ఉదయం 8 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామన్నారు. దీని కారణంగా కానూరు ఆటోనగర్, 100 అడుగుల రోడ్డు తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామన్నారు.

నేడు కొబ్బరి చిప్పల వేలం

రామవరప్పాడు: స్థానిక పేరంటాలమ్మ ఆలయంలో సోమవారం ఉదయం 10 గంటలకు కొబ్బరి చిప్పలు పోగుచేసుకునే లైసెన్స్ హక్కునకు సీల్డ్ టెండర్ కం బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి ప్రియాంక తెలిపారు. భక్తులు ఆలయంలో సమర్పించే కొబ్బరి చిప్పలను రెండేళ్ల కాలపరిమితికి పోగు చేసుకునేందుకు ఈ వేలం నిర్వహిస్తున్నామన్నారు. దేవదాయశాఖ ఉన్నతాధికారి పర్యవేక్షణలో జరిగే ఈ వేలంలో ఆసక్తి గల వారు పాల్గొనాలని కోరారు. అలాగే ఆలయంలో హుండీ కానుకలు లెక్కింపు చేపడతామని తెలిపారు. భక్తులు అమ్మవార్లకు కానుకల రూపంలో హుండీల ద్వారా సమర్పించిన ఆదాయాన్ని లెక్కిస్తామన్నారు.

26 నుంచి వారాహి నవరాత్రి మహోత్సవాలు

గన్నవరం: స్థానిక పాత గన్నవరంలో కొలువైన శ్రీలక్ష్మీతిరుపతమ్మ ఆలయంలో ఈ నెల 26వ తేదీ నుంచి ఆషాఢ మాసం సందర్భంగా వారాహి నవ రాత్రులను నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు జాస్తి శ్రీధర్ ఆదివారం తెలిపారు. నవరాత్రుల్లో ప్రతి రోజు రాత్రి 7 గంటలకు అమ్మవారి సన్నిధిలో శ్రీలలితా సహస్రనామ పారాయణం, వారాహి అష్టోత్తరం తదితర పూజా కార్యక్రమాలు జరుగుతాయన్నారు. ఈ నెల 29న ఆషాఢ మాసం తొలి ఆదివారం సందర్భంగా శ్రీలక్ష్మీతిరుపతమ్మ తల్లికి ఆషాఢ సారెను భక్తులచే సమర్పించనున్నట్లు తెలిపారు. అదే విధంగా శ్రీఅంకమ్మతల్లికి మొదటి బోనం సమర్పిస్తామన్నారు. వారాహి నవ రాత్రుల్లో భక్తులు పాల్గొనాలని ఆయన కోరారు.

నేటి యువత పోరు విజయవంతానికి పిలుపు



యువత పోరు పోస్టర్ విడుదల చేస్తున్న దేవభక్తుని చక్రవర్తి, నాయకులు

పెనమలూరు: గత ఎన్నికల్లో యువతకు అనుక హామీలు ఇచ్చి అధికారం చేపట్టిన తరువాత యువతను కూటమి ప్రభుత్వం మోసం చేసిందని వైఎస్సార్ సీపీ పెనమలూరు నియోజకవర్గ సమన్వయ కర్త దేవభక్తుని చక్రవర్తి అన్నారు. ఈ నెల 23వ తేదీన వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన యువత పోరు పోస్టర్‌ను కానూరు పార్టీ కార్యాలయంలో ఆదివారం చక్రవర్తి ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే యువతకు ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి ఇస్తామని హామీ ఇచ్చిందన్నారు. అయితే అధికారంలోకి వచ్చి ఏడాది కావొస్తున్నా నేటికి యువతకు కూటమి ప్రభుత్వం ఎటువంటి న్యాయం చేయలేదని ఆరోపించారు.

కూటమి మోసాలను ఎండగడతాం..

వైఎస్సార్ సీపీ యువతకు అండగా నిలిచి కూటమి ప్రభుత్వం మోసాలను ఎండగడతామని తెలిపారు. జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద సోమవారం యువజన విభాగం నేతలు, నాయకులు, యువతతో కలిసి కలెక్టర్‌కు మెమోరాండం ఇస్తామని, యువత పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపు నిచ్చారు. కంకిపాడు మండల పార్టీ అధ్యక్షురాలు మాదు శ్రీహరి రాణి, పార్టీలో వివిధ విభాగాల నాయకులు పి.రాఘవరావు, వేమూరి బాలకృష్ణ, అద్దెపల్లి చందు, కోడే పండు, పడవల కృష్ణమూర్తి, మండూరు కోటేశ్వరరావు, కొత్తపల్లి వెంకటేశ్వరరావు, కోటిరెడ్డి, నితీష్‌రెడ్డి, మానికొండ సూర్యతేజ, అబ్దుల్‌మతిన్, లక్ష్మారెడ్డి, రాజ్‌కమల్, శివగోపి, అఖిల్, మేకల విజయ్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ బోర్డులో జీవో నంబర్ 1213 రద్దుకు డిమాండ్



మాట్లాడుతున్న నాగబ్రహ్మాచారి తదితరులు

గన్నవరం: భవన నిర్మాణ కార్మికుల సమస్యల పరిష్కారం దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆ సంఘ నాయకుడు మోటమర్రి నాగబ్రహ్మాచారి డిమాండ్ చేశారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో ఆదివారం భవన నిర్మాణ కార్మికుల సంఘం మండల స్థాయి సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడుస్తున్నప్పటికీ భవన నిర్మాణ కార్మికులకు ఇచ్చిన ఎన్నికల హామీలను నెరవేర్చలేదన్నారు. సంక్షేమ బోర్డులో కోట్ల రూపాయల నిధులు ఉన్నప్పటికీ పాత క్లైమ్‌లు చెల్లించడానికి ప్రభుత్వం ముందుకురావడం లేదన్నారు. దీనివల్ల భవన నిర్మాణ కార్మికులు తీవ్రంగా నష్టపోతున్నారని చెప్పారు. ఇప్పటికైనా ప్రభుత్వం సంక్షేమ బోర్డులో జీవో నంబర్ 1213 ను రద్దు చేసి పాత క్లైమ్‌లు తక్షణం చెల్లించాలని కోరారు. తమ డిమాండ్ల సాధన కోసం జూలై 9న మండల రెవెన్యూ కార్యాలయాల వద్ద ఆందోళన చేపడతామన్నారు. అనంతరం సంఘ అధ్యక్షులుగా శ్రీమన్నారాయణ, ప్రధాన కార్యదర్శిగా బి.శ్రీనివాసరెడ్డి, సహాయ కార్యదర్శిగా చెరువుగట్టు ప్రసాద్, నాగబ్రహ్మాచారితో కూడిన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

దుర్గమ్మ సన్నిధిలో కూచిపూడి నృత్య ప్రదర్శన



నృత్యం ప్రదర్శిస్తున్న చిన్నారులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గమ్మ సన్నిధిలో నెల్లూరుకు చెందిన శ్రీసాయి లలిత నృత్య నికేతన్‌కు చెందిన పలువురు కళాకారులు కూచిపూడి నృత్య ప్రదర్శన ఇచ్చారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని కళావేదికపై నృత్యాచారిణి కె. శిరీష లత ఆధ్వర్యంలో 20 మందికి పైగా చిన్నారులు పలు భక్తి కీర్తనలకు లయబద్ధంగా నృత్య ప్రదర్శన చేశారు. పంచహారతుల సేవ అనంతరం అమ్మవారిని దర్శించుకుని కళావేదిక వద్దకు చేరుకున్న భక్తులు నృత్య ప్రదర్శనను ఆద్యంతం ఎంతో ఆసక్తితో వీక్షించారు. కళాకారులను అభినందించారు. నృత్య ప్రదర్శన అనంతరం చిన్నారులకు ఆలయ అధికారులు అమ్మవారి దర్శనం కల్పించి, ప్రసాదాలను అందచేశారు.

నేరాలకు పాల్పడితే కఠిన శిక్షలు



మధురానగర్(విజయవాడసెంట్రల్): నేరాలకు పాల్పడితే కఠిన శిక్షలు తప్పవని, తీరు మార్చుకుని సన్మార్గంలో పయనించాలని గుణదల సీఐ వాసిరెడ్డి శ్రీను సూచించారు. స్థానిక గుణదల పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం పాతనేరస్తులు, రౌడీషీటర్లకు ఆయన కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేరస్తుల్లో పరివర్తన తీసుకువచ్చేందుకు తాము ప్రతి ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎక్కడైనా నేరం జరుగుతున్నట్లు తెలిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో రైటర్ సంతోష్, పోలీస్‌స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

నెహ్రూ లాంటి నేత చాలా అరుదు



లబ్బీపేట(విజయవాడతూర్పు): రాజకీయాల్లో దేవినేని రాజశేఖర్(నెహ్రూ) లాంటి నేతలు అరుదుగా ఉంటారని మాజీ మంత్రి మేరుగ నాగార్జున తెలిపారు. న్యాయం కోసం రాజకీయాలు చేసిన వ్యక్తి నెహ్రూ అన్నారు. మాజీ మంత్రి దేవినేని నెహ్రూ 71వ జయంతి సందర్భంగా గుణదలలోని నెహ్రూ ఘాట్, ఎగ్జిక్యూటివ్ క్లబ్ వద్ద ఉన్న నెహ్రూ విగ్రహం వద్ద మేరుగ నాగార్జున, మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్, నెహ్రూ తనయుడు దేవినేని అవినాష్, ఇతర నాయకులతో కలిసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మేరుగ నాగార్జున మాట్లాడుతూ తండ్రి నెహ్రూ చూపిన మార్గంలో తనయుడు దేవినేని అవినాష్ పయనిస్తున్నాడని చెప్పారు. కేసులు కూడా లెక్కచేయకుండా వైఎస్ జగన్‌కు అండగా నిలుస్తున్నాడని పేర్కొన్నారు. అవినాష్ నేతృత్వంలో వైఎస్సార్ సీపీ మరింత బలంగా మారుతుందన్నారు. ఉమ్మడి కృష్ణా జిల్లాలో నెహ్రూ లాంటి నాయకుడు మరొకరు లేరని మాజీ ఎమ్మెల్యే కై లే అనిల్‌కుమార్ అన్నారు. దాదాపు మూడు దశాబ్దాల పాటు ఎమ్మెల్యేగా ఉన్నారని ఆయన దగ్గరకు వెళితే ఎలాంటి సమస్య అయినా పరిష్కారం అవుతుందని ప్రజలు నమ్మేవారన్నారు. నెహ్రూ బాటలోనే అవినాష్ కూడా ప్రజల కోసం కష్టపడి పనిచేస్తున్నాడని చెప్పారు. మళ్లీ వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చేలా కృషి చేద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నేత కడియాల బుచ్చిబాబు, నగర పాలక సంస్థ ఫ్లోర్ లీడర్ వెంకట సత్యనారాయణ, డెప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, కార్పొరేటర్లు, ఇతర నేతలు, పెద్ద సంఖ్యలో నెహ్రూ అభిమానులు పాల్గొన్నారు.

విద్యార్థినికి ఆర్థిక సాయం

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): జీవితంలో ఉన్న స్థితి నుంచి ఉన్నత స్థితికి చేరుకోవడం విద్య ద్వారానే సాధ్యమని వైఎన్నార్ చారిటీస్ చైర్మన్ యలమంచిలి జయప్రకాష్ చెప్పారు. తిరుపతిలోని ప్రైవేటు కళాశాలలో కెమికల్ ఇంజినీరింగ్ కోర్సు చదువుతున్న నేహకు కళాశాల ఫీజు నిమిత్తం రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని జయప్రకాష్ ఆదివారం అందజేశారు.

మెప్మా రిసోర్స్‌పర్సన్లకు ట్యాబ్‌ల పంపిణీ



పోరంకిలో ఆర్పీలకు ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్

పెనమలూరు: తాడిగడప మున్సిపాలిటీ పరిధిలో మెప్మా రిసోర్స్‌పర్సన్లకు ఎమ్మెల్యే బోడె ప్రసాద్ ట్యాబ్‌లు పంపిణీ చేశారు. పోరంకిలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే ట్యాబ్‌లు అందజేసి మాట్లాడారు. రిసోర్స్‌పర్సన్లు ట్యాబ్‌లు ఉపయోగించటంతో పనులు వేగవంతంగా చేయవచ్చన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రిసోర్స్‌పర్సన్స్ అవసరాలకు ట్యాబ్స్ ఇచ్చిందని వీటిని సక్రమంగా ఉపయోగించాలని సూచించారు. మెప్మా సీఎంఎం ఏవీఎస్ సుగుణ మాట్లాడుతూ.. గతంలో రిసోర్స్ పర్సన్లు ఫోన్‌లతో డేటా అప్‌లోడ్ చేసేవారన్నారు. దీని వలన పనులు జాప్యంగా జరిగేవని తెలిపారు. ఆర్పీలు స్వయం సహాయ గ్రూపుల వివరాలు వెబ్ సైట్‌లో పొందుపర్చటం వలన పని మరింత వేగంగా చేయటానికి ప్రభుత్వం ట్యాబ్‌లు మంజూరు చేసిందన్నారు. ఒక్కో రిసోర్స్ పర్సన్ 40 సంఘాలకు ప్రాతినిధ్యం వహించటం వలన పనులు త్వరితగతిన పూర్తి చేయటానికి ట్యాబ్‌లు ఎంతగానో ఉపయోగపడతాయని చెప్పారు. టీడీపీ తాడిగడప మున్సిపాలిటీ అధ్యక్షుడు అనుమోలు ప్రభాకరరావు, నాయకులు మారుపూడి ధనకోటేశ్వరరావు, కోయా ఆనంద్‌ప్రసాద్, వెలగపూడి శంకర్ బాబు, దోనేపూడి రవికిరణ్ పాల్గొన్నారు.

డ్రెయిన్ నిర్మాణ పనుల్లో డొల్లతనం

నిర్మాణ దశలో కూలిన డ్రెయిన్ గోడ



ధ్వంసమైన డ్రెయిన్ గోడ



కూలిపోయిన గోడ

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం ఎనికేపాడు హిందూ శ్మశానవాటిక వద్ద జరుగుతున్న డ్రెయిన్ నిర్మాణ పనుల్లో డొల్లతనం బయటపడింది. నిర్మాణ దశలో ఉన్న డ్రెయిన్ గోడ సగానికి ధ్వంసమై కూలడంతో ఏ మేరకు నాణ్యతా ప్రమాణాలు పాటిస్తున్నారో అర్థమవుతుంది. పంచాయతీ నిధులు సుమారు రూ.25 లక్షలతో తొలి దశగా చేపట్టిన డ్రెయిన్ నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలకు కాంట్రాక్టర్ తిలోదకాలిచ్చారు. ఈ ప్రాంతంలో చెత్త డంపింగ్‌తో పాటు మురుగు నీటి సమస్యను ఉన్నతాధికారుల ఆదేశాల నిమిత్తం పరిష్కరించేందుకు ఇటీవల డ్రెయిన్ నిర్మాణ పనులు మొదలుపెట్టారు. డ్రెయిన్‌ను ఈ శ్మశానవాటిక నుంచి వాటర్ ట్యాంక్ వరకూ నిర్మించాల్సి ఉంది.

అధికారులు స్పందించాలి..

గ్రామంలోని మురుగునీరు ఈ అండర్ గ్రౌండ్ డ్రెయిన్ ద్వారా కాలువలో కలిసే విధంగా ప్రణాళిక రూపొందించారు. ఈ పనుల్లో భాగంగా డ్రెయిన్‌కు ఇరువైపులా గోడలు నిర్మించి పనులు సాగిస్తున్నారు. మండలాధికారుల పర్యవేక్షణ, నిర్మాణ పనుల నాణ్యత పరిశీలించకపోవడంతో కాంట్రాక్టర్ నాణ్యతా ప్రమాణాలు పాటించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో నాలుగు రోజుల క్రితం నిర్మించిన డ్రెయిన్ గోడ కూలిపోయింది. ఇంకా రెండు దశల్లో సుమారు రూ.80 లక్షల మేర పనులు నిర్వహించాల్సి ఉందని, పనుల ప్రారంభంలోనే గోడ కూలిపోవడంతో గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు వెంటనే స్పందించి ఈ ఘటనపై విచారణ జరపాలని, అర్హత కలిగిన కాంట్రాక్టర్‌కు పనులు అప్పగించాలని డిమాండ్ చేస్తున్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



విజయవాడకల్చరల్: అయాచితుల కల్చరల్ అండ్ వెల్ఫేర్ అసోసియేషన్ సంస్థ ఐదో వార్షికోత్సవాలను పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ భాషా సాంస్కృతిక శాఖ, జీవీఆర్ ఘంటసాల కళాశాలలో ఆదివారం నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఇందులో భాగంగా నాట్యాచారిణి నవ్యశ్రీ బృందంలోని చిన్నారులు కూచిపూడి సంప్రదాయంలో పలు అంశాలను మనోహరంగా ప్రదర్శించారు. రాజా గురుభవానీ బృందం ఇంద్రకీలాద్రి మీద కొలువైవున్న లోకమాత కనకదుర్గమ్మపై భక్తిగీతాలను ఆలపించారు. విజయవాడ సాంస్కృతిక సమితి వారు ఎరమింగిన చేప, సాగర్ ఆర్ట్స్ వారు కాలజ్ఞానం నాటికలను ప్రదర్శించారు. అయాచితుల కల్చరల్ ఆర్ట్స్ వ్యవస్థాపకుడు అయాచితుల రామకృష్ణ మాట్లాడుతూ సంస్థ సాంస్కృతి కళారూపాల ప్రదర్శనకు పెద్దపీట వేస్తోందని తెలిపారు. నాటక రచయిత దర్శకుడు కత్తి శ్యాంప్రసాద్, రంగస్థల నటుడు పట్నాయక్, వివిధ రంగాలకు చెందిన నీలం దుర్గారావు, జీ బాలగంగాధర తిలక్ తదితరులు పాల్గొన్నారు.